జూబ్లీ చెక్‌పోస్ట్ వద్ద తీవ్ర ట్రాఫిక్‌జామ్

- కిలోమీటర్ దూరానికి సుమారు అరగంట
- అమాత్యులు తిరిగే రోడ్లు తప్పితే మిగతావి పట్టించుకోని పోలీసులు

బంజారాహిల్స్, మే 28 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఉన్నతాధికారులు సంస్కరణల పేరిట కొత్త నిబంధనలు ప్రవేశపెట్టినప్పటికీ వాటిని సరైన విధంగా స్థానిక పోలీసులు అమలు చేయకపోవడంతో వాహనదారులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు యేడాది క్రితం పోలీసులు కొన్ని నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చారు. ఇందులో ఫిలింనగర్ నుంచి చెక్‌పోస్టుకు వెళ్లే వాహనాలను జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.45 మీదుగా మళ్లింపు చేపట్టారు. కొద్ది రోజులపాటు పర్యవేక్షణ సక్రమంగా ఉండడంతో ఇబ్బందుల తలెత్తలేదు. ఇటీవల ఈ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్ర స్థాయిలో పెరిగింది. ఫిలింనగర్, మాదాపూర్, జూబ్లీహిల్స్ వాహనాలన్నీ ఇక్కడే కలుస్తుండడంతో నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతోంది. సాయంత్రం సమయాల్లో కిలో మీటర్ దూరానికి సుమారు అరగంటకు పైగా వేచి చూడాల్సి వస్తుంటే సమస్య ఎంతలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.


జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.45లో ట్రాఫిక్‌జామ్

అక్రమ పార్కింగ్‌ల బెడద..

జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్.45లోని బ్రాడ్‌వే, ఫోర్జి తదితర పబ్‌లు ఉన్నాయి. వీటికి వచ్చే వారు వాహనాలను నడిరోడ్డు మీద ఆపి వాలెట్ పార్కింగ్‌కు అప్పగిస్తున్నారు. ఈ ప్రక్రియకు సుమారు ఐదు నుంచి పదినిమిషాల సమయం పడుతుంది. దీంతో వెనకాల వచ్చే వాహనాలు ఆగిపోతున్నాయి. రోడ్డు నెంబర్.45 నుంచి రోడ్డు నెంబర్.36కు వెళ్లేందుకు బ్రిడ్జి కింద నుంచి యూ టర్న్ తీసుకోగానే ఓ భవనం తాలూకు వాహనాలు రోడ్డు మీదే పార్కింగ్ చేసి ఉంటాయి. అసలే చిన్న రోడ్డు ఈ పార్కింగ్‌తో మరింత కుచించుకుపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ రోడ్డు వెంబడి ఉన్న వ్యాపార సముదాయాలకు ఇప్పటికీ సరైన పార్కింగ్ వ్యవస్థ లేకపోవడం ట్రాఫిక్ ఇబ్బందులకు కారణంగా చెప్పవచ్చు.


చిన్నదారిలో రాకపోకలు సాగించలేక ఆగిన వాహనాలు

రాంగ్‌రూటులో దూసుకొస్తున్న వాహనాలు

జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్ పాలపిట్ట చౌరస్తా వద్ద నేరుగా జూబ్లీహిల్స్ కమ్యూనిటీ సెంటర్ వెళ్లే రోడ్డును పోలీసులు మూసివేశారు. కాస్త ముందుకు వెళ్లి రోడ్డు నెంబర్.52కు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. అయితే ఇక్కడ రాంగ్ రూటు అడ్డుకునేందుకు గతంలో కానిస్టేబుల్ ఉండే వారు. కొన్నిరోజులుగా ఎవరూ లేకపోవడంతో రాంగ్‌రూటులో వాహనాలు దూసుకువస్తున్నాయి. అసలే కమ్యూనిటీ సెంటర్ ఇరుకైన రోడ్డు దానికి తోడు రాంగ్ రూటు వాహనాలతో గంటల తరబడి ట్రాఫిక్‌జామ్ అవుతోంది. రోడ్డు నెంబర్.36 నుంచి తరుచూ సీఎం రేవంత్‌రెడ్డి రాకపోకలు సాగిస్తూ ఉంటారు. దీంతో ట్రాఫిక్‌కు ఆటంకాలు కలుగుతుంటాయి. ఈ క్రమంలో రోడ్డు నెంబర్.36 పెద్దమ్మ ఆలయం రోడ్డు మీదుగా మళ్లించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ, ఇక్కడ అక్రమ పార్కింగ్‌ల కారణంగా రోడ్లపై వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి సామాన్యుడిని ట్రాఫిక్ కష్టాల బారి నుంచి తప్పిస్తారో? లేదో? వేచి చూడాలి.


రాంగ్‌రూట్‌లో దూసుకువస్తున్న వాహనాలు

మారని ఖలీద్.. ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

బంజారాహిల్స్, మే 28 (ఆంధ్రజ్యోతి): క్రిమినల్ కేసులు నమోదు చేసినా ప్రభుత్వ స్థలంపై పట్టు విడవకుండా మరోసారి కబ్జాకి ఎక్కించిన ఖలీద్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14లోని సర్వే నెంబర్.43లో ప్రభుత్వానికి చెందిన ఎకరంకుపైగా స్థలం ఉంది. ఈ స్థలం తనదేనంటూ ఖలీద్ అనే వ్యక్తి పలుమార్లు ఆక్రమించేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. తాజాగా 15 రోజుల క్రితం మరోసారి కబ్జాకు యత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకొని బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయినప్పటికీ ఖలీద్ రెండు రోజుల క్రితం ఆక్రమించేందుకు తన మనుషులను పంపించాడు. సమాచారం అందుకున్న షేక్‌పేట రెవెన్యూ అధికారులు స్థలంలో ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు ఖలీదుపై మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బీఎంఎస్ సెక్షన్ 329(3), 394(4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఇంకుడు గుంతను పునరుద్ధరిస్తున్న స్థానికులు

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

పంజాగుట్ట, మే 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వాన నీటిని ఒడిసి పట్టుకునేందుకు, నీరు భూమిలో ఇంకేందుకు ప్రతీ ఒక్కరూ తమ ఇంటి ఆవరణ, పార్కులు, మైదానాలు, కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం వెంగళరావునగర్ ఏ-బ్లాక్ పార్కు వద్ద ఉన్న ఇంకుడు గుంతలో పేరుకుపోయిన బురద, వ్యర్థాలను తొలగించి, కంకర, ఇసుక పోసి వాటిని పునరుద్ధరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది లక్ష్మీకాంతరావు, ప్రొఫెసర్ టీవీరెడ్డి, సాయి, నాగరాజు, భరత్, స్థానికులు పాల్గొన్నారు.


భవనం వ్యర్థాలను తొలగిస్తున్న శానిటేషన్ సిబ్బంది

భవనం వ్యర్థాల తొలగింపు

బేగంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ ఓల్డ్ కస్టమ్స్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాల వద్ద డంప్ చేసిన వ్యర్థాలను శానిటేషన్ అధికారులు బుధవారం తొలగించారు. శానిటేషన్ జవాన్ కృష్ణ పర్యవేక్షణలో సిబ్బంది వ్యర్థాలను తొలగించారు. ఈ పనులను కాంగ్రెస్ సీనియర్ నేత విశాల్ సుధాం పర్యవేక్షించారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి

గచ్చిబౌలి, మే 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి అందరూ సహకరించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. లింగంపల్లి ఆర్‌ఓబీ వద్ద వర్షపు నీరు నిల్వకుండా రూ.4 కోట్ల వ్యయంతో బాక్స్ కల్వర్టు పనులు చేశారు. లింగంపల్లి గ్రామం వైపు నుంచి కాలువ పనులను అధికారులు ప్రారంభించారు. కొంతవరకు పనులు జరిగాయి. గ్రామం వద్ద కొంతమంది పనులను అడ్డుకోవడంతో రెండు నెలల నుంచి పనులు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న హైడ్రా కమిషన్ రంగనాథ్ బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. వరదనీటి తీవ్రత గురించి కార్పొరేటర్ రాగం నాగేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఓబీ నుంచి లింగంపల్లి గ్రామం వరకు, నల్లగండ్ల పెద్దచెరువు నుంచి వచ్చే నాలాను రంగనాథ్ పరిశీలించారు. నిలిచిపోయిన ఆర్‌ఓబీ పనులను ప్రారంభించి పూర్తి చేయాలని హైడ్రా అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం గోపీ చెరువును పరిశీలించారు. సీఎస్ఆర్ నిధులతో సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హైడ్రా అధికారులు, సిబ్బంది, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


లింగంపల్లి ఆర్‌ఓబీ వద్ద పనులను పరిశీలిస్తున్న రంగనాథ్, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, అధికారులు

బల్కంపేటలో రూ.2.20 లక్షలు చోరీ

- లాకర్‌లో డబ్బులు ఎత్తుకెళ్లిన దొంగలు

అమీర్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట లింగయ్యనగర్‌లో మంగళవారం రాత్రి శ్రీరామ్ దేవ్ ట్రేడర్స్‌లో చోరీకి పాల్పడిన దొంగలు రూ.2.20 లక్షల నగదును దోచుకెళ్లారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట లీలానగర్‌కు చెందిన మనోజ్‌కుమార్ బజాజ్ (44) శ్రీ రామ్‌దేవ్ ట్రేడర్స్ పేరుతో 11 సంవత్సరాలుగా ఎఫ్.ఎం.సి.జి డిస్ట్రిబ్యూటర్‌షిప్‌ను లింగయ్యనగర్‌లో నడిపిస్తున్నాడు. సోమవారం రాత్రి కార్యాలయానికి తాళం వేసి వెళ్లిన మనోజ్ కుమార్ మంగళవారం ఉదయం వచ్చిచూడగా.. ఆఫీస్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. కార్యాలయంలోని లాకర్స్‌లో భద్రపరిచిన రూ.2.20 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

యూసుఫ్‌గూడ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తులపై మధురానగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కార్మికనగర్‌కు చెందిన సానియాబేగంకు గుగూల్ ఐడీ ద్వారా ఉద్యోగం చేసి డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపించి విడతల వారీగా అలీషా అనే వ్యక్తి రూ.71,500 తీసుకున్నాడు. ఉద్యోగం ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తుండగా, అలీషాపై సానియా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇన్‌స్టాగ్రామ్..

మధురానగర్‌కు చెందిన సివిల్ ఇంజనీర్ ఇలకళ దేవికకు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, పార్ట్ టైం ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.72,500ను ఫోన్ పే ద్వారా గుర్తు తెలియని వ్యక్తి తీసుకున్నాడు. ఉద్యోగం రాక, ఇచ్చిన డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయానని తెలుసుకొని దేవిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

స్నాప్‌చాట్..

స్నాప్‌చాట్‌ను లైక్, షేర్ చేయడం వల్ల ఆదాయం పొందవచ్చని ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి చెప్పడంతో మధురానగర్ సాయిరామ్ గార్డెన్ ప్రాంతానికి చెందిన ఎస్‌బీఐ ఉద్యోగి సత్వీంద్ర కౌర్ రూ.43 వేలను పేటీఎం ద్వారా చెల్లించాడు. వెంటనే మోసం జరిగిందని తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మారు పేర్లతో..

వెంకటరమణకాలనీ దమ్మాయిగూడకు చెందిన మనుపాటి నానిని సంజయ్, సంధ్యచౌదరి నకిలీ పేర్లతో షేక్ సుభాని, షేక్ నాగూర్‌లుగా పరిచయం చేసుకున్నారు. పార్ట్ టైం ఉద్యోగం ఇప్పిస్తామని రూ.1.40 లక్షలు తీసుకున్నారు. పనిలో పెట్టారు కానీ.. నెలలు గడుస్తున్నా జీతం ఇవ్వకపోవడంతో నాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తెలుగు ప్రజల గౌరవం ఎన్టీఆర్

- సినీరచయిత పరుచూరి గోపాలకృష్ణ

బంజారాహిల్స్/పంజాగుట్ట/ఎర్రగడ్డ/యూసుఫ్‌గూడ, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల గౌరవం దివంగత ఎన్టీఆర్ అని సినీరచయిత పరుచూరి గోపాలకృష్ణ అన్నారు.ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఫిలింనగర్‌లోని మహనీయుల చౌరస్తాలో బుధవారం ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహానికి నందమూరి మోహనకృష్ణ, పరుచూరి గోపాలకృష్ణ, సినీనిర్మాత మాదాల రవి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ దేశం సినిమాతో సినీరంగంలో అడుగుపెట్టి అనేక చిత్రాలు నిర్మించడంతోపాటు రాజకీయాలకు వచ్చి పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఎన్టీఆర్‌దేనని అన్నారు. తెలుగు వారి కీర్తి ప్రపంచానికి తెలిసేలా చేసింది ఆయనేనని గుర్తు చేశారు. నందమూరి మోహనకృష్ణ మాట్లాడుతూ తన తండ్రి జయంతి అంటే అది తన కుటుంబానికి పండుగ రోజు అన్నారు సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన ఆయన ప్రపంచంలో ప్రతీ ఒక్కరు గుర్తించే స్థాయికి ఎదిగారని అన్నారు. ఆయన జీవితం కుటుంబసభ్యులందరికీ స్ఫూర్తి అని అన్నారు. మాదాల రవి మాట్లాడుతూ టీడీపీని స్థాపించి అతి తక్కువ సమయంలో ముఖ్యమంత్రి అయిన ఘనత ఎన్టీఆర్‌ది అని అన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నందమూరి సీమ, నందమూరి రూప, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

- సికింద్రాబాద్ పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు సీహెచ్ విజయశ్రీ వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ చౌరస్తాలో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున్ నాయుడు, డి.సతీష్, కోటిరెడ్డి, రఘు, రాఘవ, నాగరాజు,ప్రశాంత్, కోమటి శ్రీను, రవి, రమణయ్య, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


మధురానగర్ చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


ఫిలింనగర్ మహనీయుల చౌరస్తాలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సినీరచయిత పరుచూరి గోపాలకృష్ణ, నందమూరి మోహన్‌కృష్ణ, మాదాల రవి


కళ్యాణ్‌నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి నివాళులర్పిస్తున్న ఎన్టీఆర్ అభిమానులు కిలారి మనోహర్, సత్యనారాయణ, రాజ్‌కుమార్‌గౌడ్ తదితరులు


ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పిస్తున్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏబీఆర్ మోహన్‌రావు, తదితరులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం : మన్నె

బంజారాహిల్స్, మే 28 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఏడాదిన్నరలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని విమర్శించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి కాళేశ్వరం పేరిట డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు.

మట్టికుప్పలు ఎత్తండి

యూసుఫ్‌గూడ, మే 28 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని లక్ష్మీనరసింహనగర్, కృష్ణానగర్ బీ బ్లాక్‌తోపాటు పలు బస్తీల్లో రోడ్లపై మట్టికుప్పలు నెలల తరబడి ఉన్నాయి. వర్షాకాలం కావడంతో చెత్త, మట్టి కుప్పలు నిల్వ ఉండడం వల్ల ఈగలు, దోమలు విజృంభించే అవకాశం ఉందని స్థానిక మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి కుప్పలను తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టికుప్పలను తొలగించాలని కోరుతున్నారు.


రోడ్లపై ఉన్న మట్టికుప్పలు


పూలు, నిమ్మకాయలతో అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ

ప్రత్యేక అలంకారంలో బల్కంపేట ఎల్లమ్మ

అమీర్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని రోజుకో విధంగా అలంకరిస్తున్నారు. బుధవారం గర్భగుడిలో అమ్మవారి మూల విరాట్‌లను రకరకాల పూలు, ఆకులు, నిమ్మకాయలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుండడంతో ఆలయం వెలుపలి నుంచి లోపలి వరకు ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. అన్నదానం కాంప్లెక్స్‌లో రోజూ నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల

గచ్చిబౌలి/ఖిల్ కాలనీ, మే 28 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు రూ. 200 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తుందని, అందులో భాగంగా తాను అడగగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో పాఠశాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినందుకు గాంధీ కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులకు సన్మానం

రాయదుర్గం, మే 28 (ఆంధ్రజ్యోతి): పన్నెండవ తరగతి బోర్డు పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన హైదరాబాద్ రీజియన్‌లోని కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులను బుధవారం గచ్చిబౌలిలోని ఫుట్‌వేర్ డిజైన్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)ఆడిటోరియంలో సన్మానించారు. కేవీఎస్ ఆర్‌వో హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ జి.కృష్ణవేణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నర్సింహగారి తేజ్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైట్లు ఆర్పేసి మహిళలపై దాడి

- జూబ్లీహిల్స్ బాబీలాన్ పబ్‌లో దారుణం

బంజారాహిల్స్, మే 28 (ఆంధ్రజ్యోతి): బిల్లు ఎక్కువ వేశారని నిలదీసినందుకు లైట్లు ఆర్పేసి మహిళలపై దాడి చేశారు పబ్ సిబ్బంది. సోషల్ మీడియాలో ఈ దారుణాన్ని బాధితురాలు పోస్టు చేయడంతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. చర్లపల్లికి చెందిన దీనా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్ మీనల్ మీను ఆమె తల్లి మరికొంతమంది ఈనెల 26న జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.10లోని బాబీలాన్ పబ్‌కు వెళ్లారు. జోమాటో 20 శాతం రాయితీ కింద టేబుల్ బుక్ చేసుకున్నారు. పార్టీ అయిపోయాక పబ్ సిబ్బంది బిల్లును దీనాకు ఇచ్చారు. బిల్లులో తమకు రావాల్సిన 20 శాతం రాయితీ ఇవ్వలేదని, అంతేగాకుండా తాము అర్డర్ చేయని డ్రింక్‌కు రూ.1,850 వేసినట్టు గమనించింది. ఇదే విషయాన్ని సిబ్బందిని నిలదీయగా వారు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. నిష్టూరంగా మాట్లాడారు. వారి ప్రవర్తనను వీడియో తీసేందుకు దీనా, మీనల్ ప్రయత్నించారు. ఈ క్రమంలో పబ్ సిబ్బంది లైట్లు ఆర్పేసి దీనా, మీనల్ ఆమె తల్లిపై చేయి చేసుకున్నారు. దుర్భాషలాడారు. ఈ ఘటనతో షాక్‌కు గురైన మీనల్ తమకు జరిగిన అన్యాయం గురించి సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఇది వైరల్‌గా మారింది. జూబ్లీహిల్స్ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ప్రమాదం

యూసుఫ్‌గూడ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడిపి ప్రమాదానికి గురయ్యాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండకు చెందిన ఎం.తేజ అమీర్‌పేట మెట్రో పిల్లర్ నెంబర్.1460 వద్ద ప్రమాదానికి గురయ్యాడని వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయాల పాలైన తేజను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతడిని పరిశీలించగా మద్యం మత్తులో ఉన్నాడని నిర్ధారించి కేసు నమాదు చేశారు.



చెట్టుకు పూజ చేసి తొలగిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు బృందం

చెట్టును తొలగించిన ట్రాఫిక్ అధికారులు

తిరుమలగిరి మే 28(ఆంధ్రజ్యోతి): లోతుకుంట జంక్షన్ వద్ద ప్రమాదకరంగా ఉన్న ఒక పెద్ద చెట్టును ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు బృందం బుధవారం చెట్టుకు పూజ చేసి తొలగించారు. మరలా అదే ప్రాంతంలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నాటారు. ట్రాఫిక్ సాఫీగా వెళ్లడానికి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. చెట్టుకొమ్మల వల్ల ప్రయాణికులకు ప్రమాదాలు సంభవించిన ఘటనలు కూడా ఉన్నాయి. ఆంధ్రజ్యోతిలో కథనం మేరకు తొలగించామని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ మధు బాబు తదితరులు ఉన్నారు.



నీటి కాలువ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బస్తీవాసులు

కాలువకు మరమ్మతులు చేయాలి

అడ్డగుట్ట, మే 28 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అడ్డగుట్ట ఏ-సెక్షన్‌లో ఉన్న వాననీటి కాలువకు మరమ్మతులు చేయాలని సీపీఎం పార్టీ సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ ఎం. అజయ్‌బాబు అధికారులను కోరారు. బుధవారం బస్తీవాసులతో కలిసి నీటి కాలువను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అడ్డగుట్ట ఏ సెక్షన్‌లో ఎదురుగా ఉన్న వాననీటి కాలువను వెంటనే మరమత్తులు చేయాలని అధికారులను కోరారు. ఏ-సెక్షన్‌లో 900 వందల కుటుంబాలు నివసిస్తున్నాయని, కాలువను ఎవరుపడితే వారు ఇష్టం వచ్చినట్లుగా కబ్జా చేస్తున్నారని తెలిపారు. వారం రోజుల క్రితం ఏఈ అశ్విన్‌కుమార్, డీఈ విజయలక్ష్మిలకు ఫిర్యాదు చేస్తే తాము వచ్చి పరిశీలిస్తామని హడావుడి చేశారు కానీ సమస్య పరిష్కారం చేయలేదన్నారు. సమస్యను పట్టించుకోకపోతే జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని, లేదంటే అధికారులను బదిలీ చేసి కొత్త అధికారుల ద్వారా సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బస్తీవాసులు ఫాతిమా, లక్ష్మీబాయి, శ్రీనివాస్, మాదవి, ఫాతిమామ్మ, అంజమ్మ, ఎల్లయ్య, ప్రవీణ్, అజయ్‌బాబు పాల్గొన్నారు.

పేద మున్నూరు కాపులను ఆదుకుంటాం: చేపూరి

బౌద్ధనగర్, మే 28(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న మున్నూరుకాపు కులస్తులను ఆదుకుంటామని సికింద్రాబాద్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చేపూరి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నామాలగుండు బీఎస్ఆర్ గార్డెన్‌లో ఇటీవల మరణించిన మున్నూరుకాపు సంఘ సభ్యుడు బి.సంతోష్‌కుమార్ కుటుంబ సభ్యులకు చేపూరి వెంకటేశ్వరరావు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావుతో చర్చించి సంతోష్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీక నారాయణ, బల్గూరి శంకర్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్‌కప్‌కు స్కేటర్ శ్రీశాంత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రోల్‌బాల్ వరల్డ్ కప్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టులో సికింద్రాబాద్ స్కేటర్ శ్రీశాంత్‌కు చోటు లభించింది. ఈ పోటీలు వచ్చే నెల 22 నుంచి 29 వరకు కెన్యాలో జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు సహాయ కోచ్‌గా నగరానికి చెందిన శిల్ప నియమితురాలైంది. ఈ ఇరువురిని రాష్ట్ర రోల్‌బాల్ స్కేటింగ్ సంఘం కార్యదర్శి సయ్యద్ ఎహసాన్, శాట్ కోచ్ జితేందర్ గుప్త అభినందించారు.



శ్రీశాంత్‌ను అభినందిస్తున్న రాష్ట్ర రోల్‌బాల్ సంఘం

భవనం వ్యర్థాల తొలగింపు

బేగంపేట, మే 28(ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ ఓల్డ్ కస్టమ్స్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాల వద్ద డంప్ చేసిన వ్యర్థాలను శానిటేషన్ అధికారులు బుధవారం తొలగించారు. శానిటేషన్ జవాన్ కృష్ణ పర్యవేక్షణలో సిబ్బంది వ్యర్థాలను తొలగించారు. కాంగ్రెస్ సీనియర్ నేత విశాల్ సుధాం పర్యవేక్షించారు.

క్రైమ్ సమాచారం

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం



దివ్యశ్రీ (ఫైల్)

బౌద్ధనగర్, మే 28(ఆంధ్రజ్యోతి): ఆఫీసుకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మెట్టుగూడకు చెందిన డి.దివ్యశ్రీ(33) నగరంలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. దివ్యశ్రీ తండ్రి మరణించటంతో తల్లి పద్మావతి మతిస్థిమితం కోల్పోయింది. ఈ నెల 25న ఉదయం 11:30కు దివ్యశ్రీ ఆఫీసుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావటంతో దివ్యశ్రీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో మంగళవారం రాత్రి తన చెల్లెలు కనిపించటం లేదని అక్క డి.స్రవంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిలకలగూడలో వ్యక్తి..

ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వారాసిగూడ బ్రాహ్మణబస్తీలో కుటుంబ సభ్యులతో కోల విక్రమ్(48) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు పనిచేసే ఉద్యోగంలో ఒత్తిడిలను ఎదుర్కొంటున్నాడు. ప్రతిరోజు భోజనానికి వచ్చే విక్రమ్ ఈ నెల 25న మధ్యాహ్నం రెండు గంటలు దాటినా ఇంటికి రాకపోవడంతో భార్య సుధావాణి భర్తకు ఫోన్ చేయగా అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అతడి కోసం పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవటంతో భార్య మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య



కోల విక్రమ్ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : రైలుకింద పడి ఓ గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబరు-3 ట్రాక్ వద్ద గుర్తుతెలియని 25 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించి చూస్తే వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ ఇంతవరకు తెలియరాలేదని తెలిపారు. కేసు నమోదుచేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దృష్టి మరల్చి ఫోన్ పే ద్వారా డబ్బులు కాజేసిన కేటుగాళ్లు

తిరుమలగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి) : తాటి ముంజలు కొనుగోలు చేస్తున్న వ్యక్తిని దృష్టి మరల్చి రూ.50 వేలు ఫోన్ పే ద్వారా కాజేసిన సంఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్వాల్‌కు చెందిన క్రిష్ణ బిల్డర్. రెండురోజుల క్రితం లోతుకుంటలో తాటి ముంజలు కొనుగోలు చేసి ఫోన్ పేతో డబ్బులు చెల్లించాడు. పాస్‌వర్డ్ గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు క్రిష్ణ చుట్టూ చేరి ఫోన్ దొంగతనం చేసి ఆ ఫోన్ నుంచి ఫోన్ పే ద్వారా రూ. 50 వేలు వాళ్ల అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఆ తర్వాత విషయం గమనించిన క్రిష్ణ అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించడంతో తిరుమలగిరిలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



టోకెన్ల కోసం కౌంటర్ వద్ద భక్తులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఆర్జితసేవ భక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- క్యూలైన్‌లోనే అన్నప్రసాద టోకెన్లు ఇవ్వాలి

రెజిమెంటల్‌బజార్,మే 28(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో నిత్య అన్నదానం టోకెన్ల పంపిణీలో ఆర్జితసేవలో పాల్గొనే భక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. నాగదోష పూజలు, హోమం, సత్యనారాయణ వ్రతం పూజలు చేయించుకోవడానికి వచ్చే భక్తులు సహజంగా ఉపవాసంతో వస్తుంటారు. పూజల అనంతరం భోజనం చేయాలనుకున్న వారికి అన్నప్రసాద టోకెన్‌లు లభించడం లేదు. దీంతో ఆకలితో వెళ్లాల్సివస్తోంది. ఆర్జిత సేవలకు టోకెన్ తీసుకున్న సమయంలోనే అన్నప్రసాద టోకెన్లు అందిస్తే బాగుంటుందని భక్తులు తెలిపారు. ఒకవేళ అన్నప్రసాద సమయం వరకు వేచి ఉండలేకపోతే ఆ టోకెన్లను సాధారణ భక్తులకు పంపిణీ చేసే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. కొంతమంది అన్నప్రసాదం పంపిణీ చేసే సమయానికి వచ్చి టోకెన్లు తీసుకుని భోజనం చేస్తున్నారు. అలారోజు వచ్చేవారిని గమనించి ఆలయ సిబ్బంది ప్రశ్నిస్తే.. ఏం నువ్వు ఇంటి నుంచి ఇస్తున్నావా అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల ఆలయానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం లభించకపోవడంతో నిరాశగా వెళ్తున్నారు. ఆలయానికి వచ్చే వారికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.

మొక్కుబడిగా పంపిణీ

ఆలయం ఆధ్వర్యంలో రోజుకు వందమందికి అన్నప్రసాదం అందించడానికి తయారు చేస్తున్నారు. ఈ పంపిణీలో ఒక పద్ధతి లేక, మొక్కుబడిగా సాగుతుంది. రోజూ పదకొండున్నరకు వచ్చిన 100మందికి టోకెన్లు ఇచ్చి, ఒకటింపావుకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నారు. అన్నప్రసాదం ఆలయానికి వచ్చేవారే స్వీకరిస్తున్నారా, కేవలం తినడానికే రోజూ వస్తున్నారా అనే అంశాలను ఆలయ అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.



నియామక పత్రాన్ని అందుకుంటున్న బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్ తదితరులు

బీజేపీ తార్నాక డివిజన్ కమిటీ నియామకం

తార్నాక, మే 28 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ తార్నాక డివిజన్ పూర్తిస్థాయి కమిటీని నియమించినట్లు బుధవారం ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. అధ్యక్షుడుగా బండారి ఉపేందర్ యాదవ్ నియామకం కాగా ఉపాధ్యక్షులుగా జి.ప్రవీణ్‌గౌడ్, జి.మమత, సి.అజయ్ ముదిరాజ్, ఎన్.మహేష్, ప్రధాన కార్యదర్శులుగా ఎం.కె.ప్రమోద్ కుమార్, సతీష్‌రెడ్డి, కోశాధికారిగా బండారి శ్రీనివాస్, కార్యదర్శులుగా ఆశా మాతురి, ఎ.గణేష్‌కుమార్, జె.క్రాంతికుమార్, విజయలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా పి.నంద ముదిరాజ్, విష్ణు, సతీష్ యాదవ్, సాయి చందు చారి, సత్తమ్మ, శ్రీకాంత్, పి.శ్రీ క్రిష్ణ, ఎం. హేమంత్, గోపి, అమర్ నియమితులయ్యారు.



నివాళులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా టీడీపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్ కుమార్ బుధవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తార్నాక చౌరాస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు కాత విజయ్ కుమార్, బీసీ సెల్ కార్యదర్శి నాలుబందు శ్రీనివాస్, సంధ్య, పోగు రాజశేఖర్, విక్రమ్, రామారావు తదితరులు పాల్గొన్నారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

బౌద్ధనగర్, మే 28(ఆంధ్రజ్యోతి): పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని చిలకలగూడ డివిజన్ ఏసీపీ కె.శశాంక్‌రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వారాసిగూడ, చిలకలగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో బక్రీద్ పండుగను మతాలకతీతంగా జరుపుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో అనుమానస్పదంగా వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారమందించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తే ముందస్తుగా పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. బక్రీద్ పండుగ పురస్కరించుకుని ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. త్వరలో కాలనీలు, అపార్ట్‌మెంట్ వాసులు, వ్యాపారస్తులతో సమావేశాలను నిర్వహించి సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి తదితరులు

జర్నలిస్టుల హక్కుల సాధనకు కృషి

తిరుమలగిరి మే 28(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతర కృషి చేస్తున్నామని తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్ అన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 31న జలవిహార్‌లో జరగబోయే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తిరుమలగిరి జయలక్ష్మీ గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో రజతోత్సవ సభ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఏర్పడిన ప్రథమ జర్నలిస్టు సంఘంగా తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం చేసిన పోరాటాలు, త్యాగాలు, ఉద్యమాల నేపథ్యంలో రజతోత్సవ సభ జరగనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత యూనియన్ తరపున జర్నలిస్టుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేసినట్లు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర నాయకులు కార్యనిర్వాహణ కార్యదర్శి నవీన్, కోశాధికారి యోగానంద్, టెంజు కార్యదర్శి రమణ, ఐజేయూ కార్యవర్గ సభ్యుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కంటోన్మెంటు సీనియర్ జర్నలిస్టులు విక్రమ్, శ్రీకాంత్ ముదిరాజ్, అశోక్, రాములు, రమణ, సతీష్, వంశీ, శ్రీకాంత్, ప్రవీణ్, వాసు, వెంకటేష్, వెంకట్, బాబురావు, రవి, మల్లికార్జున్, యాదగిరి, తదితరులు ఉన్నారు.



తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సభ క్యాలెండర్‌ను విడుదల చేసిన మారుతీసాగర్



స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తనయుడు నందమూరి రామకృష్ణ, ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాసకుమార్ తదితరులు

తెలుగు ప్రజల గౌరవం ఎన్టీఆర్

బౌద్ధనగర్, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన మహానుభావుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని ఆయన తనయుడు నందమూరి రామకృష్ణ అన్నారు. బుధవారం రాత్రి తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ ఆధ్వర్యంలో సీతాఫల్‌మండిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ నటనతో తెలుగు ప్రజల ఆదారాభిమానాలు పొందారని, సీఎంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఎంతో అభివృద్ధి పర్చారన్నారు. ప్రపంచస్థాయిలో తెలుగుభాషకు గుర్తింపు ఎన్టీఆర్‌తోనే వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సంగీతా విభావరి పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా, నాయకులు రమేష్‌బాబు, విజయకుమార్, రాహుల్, నాయుడు, మంద వెంకటస్వామి, ప్రవీణ్, చిరంజీవి రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



చలో ధర్నా చౌక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.సింహాద్రి, ముస్లిం జేపీసీ నాయకులు


వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

- సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి

తార్నాక, మే 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.సింహాద్రి అన్నారు. వక్ఫ్ అమెండ్‌మెంట్ 2025 చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 31న ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో ధర్నా చౌక్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం తార్నాకలోని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ప్రొ.సింహాద్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల భూములను కొల్లగొట్టేందుకే కేంద్రం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందని, సమాజంలో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేవిధంగా ఉందని విమర్శించారు. ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన చలో ధర్నా చౌక్ కార్యక్రమానికి సమాజ్‌వాది పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ మీర్జా మజర్‌ఉల్లా బేగ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు మహమ్మద్ రిజ్వాన్ హుస్సేన్, మహమ్మద్ వజీద్ సిద్దిఖీ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

అడ్డగుట్ట, మే 28 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రేతలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి సిహెచ్.లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. "మద్యం, మాదక ద్రవ్యాల నుంచి మన బాలలను రక్షించుకుందాం" నినాదంతో తెలంగాణ తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక, మహిళా సంఘాలు, మాల సంక్షేమసంఘం, సీపీఐ, ఎంసీపీఐల ఆధ్వర్యంలో బుధవారం తుకారాంగేట్ చౌరస్తా నుంచి అడ్డగుట్ట మీదుగా తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడికి వెళ్లే పిల్లలు కూడా గంజాయికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. సికింద్రాబాద్‌లోనే గాకుండా తుకారాంగేట్ ఏరియాలో గంజాయి విక్రేతలపై చర్యలు తీసుకోవాలని తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భాగ్య మాట్లాడుతూ గంజాయికి వ్యతిరేకంగా తమ వద్దకు అనేక ఫిర్యాదులు వచ్చాయని సీఐకి వినతి పత్రం సమర్పించారు. అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమమే జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి, శ్రీనివాస్, నక్కామధు, వెంకటేష్ గౌడ్, మాదక ద్రవ్యాల మండల కన్వీనర్ నర్సింగ్‌రావు, సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్ ప్రవీణ్, రమాదేవి, రుద్రవీణా మహిళా మండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభ, సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్, ఎంసీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి ఆర్.మల్లేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు రాంలీల, సమ్మయ్య, హరి, పుష్ప, స్వరూప, నగేష్, రవి కుమార్, బొట్టు ప్రభాకర్, రమాదేవి, పుష్పలత ఎంపీ ఫౌండేషన్ ఇన్‌చార్జిలు, ఆర్గనైజర్లు సువర్ణ, లావణ్య, సౌజన్యలతోపాటు యూత్ యువరత్నాల బృందం పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించిన అనంతరం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సభ్యులు

దేవాలయానికి మరింత ఖ్యాతి తీసుకురావాలి

సికింద్రాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గణపతి దేవాలయానికి మరింత ఖ్యాతి తీసుకురావాలని నూతనంగా నియమితులైన ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ సూచించారు. దేవాలయం ట్రస్టు బోర్డు సభ్యులుగా నియమితులైన ముకేష్‌యాదవ్, జాజుల క్రాంతి, వందనలు బుధవారం ఆయనను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ గణపతి దేవాలయం తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిందని, ఆలయ ఖ్యాతి మరింత పెంచడానికి కృషి చేయాలని సూచించారు. ఆలయ ట్రస్టు బోర్డులో చోటు కల్పించిన కంటోన్మెంట్ శాసన సభ్యుడు శ్రీగణేష్ పేరు నిలబెట్టాలని పేర్కొన్నారు. పవన్, అనూష, ఆంథోనియమ్మ, పద్మ, జయశ్రీ, విజయ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ నుంచి ఎస్సైగా పదోన్నతి



వెంకటేశ్వర్లు, ఎస్సై

అడ్డగుట్ట, మే 28(ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు ఎస్సైగా పదోన్నతి బాధ్యతలు చేపట్టారు. 1984లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి బేగంపేట్, పుత్లిబౌలి, పోలీస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఉస్మానియా వర్సిటీ పోలీస్‌స్టేషన్, స్పెషల్ బ్రాంచ్ ఇలా నగరంలో అనేక చోట్ల విధులు నిర్వహించారు. తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా చేరిన రెండేళ్లకే ఎస్సైగా ప్రమోషన్ రావడంతో సహోద్యోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



అఖిల భారత శ్రీశైల క్షేత్ర వడియరాజుల నిత్య అన్నదాన సత్ర సంఘం చైర్మన్ సత్యనారాయణ రాజును సన్మానిస్తున్న శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ సభ్యులు

వడ్డెర సొసైటీ అభివృద్ధికి కృషి

తార్నాక, మే 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు గండికోట కుమార్ అన్నారు. ఇటీవల శ్రీశైలంలో ఈ వడ్డెర సొసైటీకి ప్రత్యేకంగా గది కేటాయించడాన్ని హర్షిస్తూ బుధవారం అఖిల భారత శ్రీశైలక్షేత్ర వడియరాజుల నిత్యాన్నదాన సత్ర సంఘం చైర్మన్ సత్యనారాయణ రాజును శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అడ్వజర్ యాదయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నియామకం



బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కిరణ్ కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షులు భరత్ కుమార్ కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ మహంకాళి అధ్యక్షులు శ్రీ శ్యామ్ సుందర్‌గౌడ్, బోర్డు నామినేటెడ్ సభ్యులు బానుక నర్మద, టోపి శంకర్, కన్వీనర్ విజయానంద్, జాయింట్ కన్వీనర్ సతీష్ ధనంజయ చారిలకు కృతజ్ఞతలు తెలిపారు. - తిరుమలగిరి, (ఆంధ్రజ్యోతి)



మర్యాద పూర్వక కలయిక

చిలకలగూడ డివిజన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కె.శశాంక్‌రెడ్డిని బుధవారం ఏసీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ, మాజీ కార్పొరేటర్ కందినారాయణ తదితరులు. - (బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి)